క్లుప్తంగా

ఆర్డీఓకు అభినందనలు



సత్తెనపల్లి: రెవెన్యూ డివిజన్ అధికారిగా ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గాజులపల్లి వెంకట రమాకాంతరెడ్డిని ఏపీ ఎన్జీవోస్ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలసి, శుభాకాంక్షలు తెలిపారు. వారిలో సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడు పెండెం మణిరావు, సెక్రటరీ ఎస్.అంబేడ్కర్, ట్రెజరర్ కోటేశ్వరావు, సంయుక్త కార్యదర్శులు డి.శ్రీనివాసరావు, ఎస్. శ్రీనివాసరావు, ఇబ్రహీం, వెస్లీ, అంకమ్మరావు ఉన్నారు.

మదర్ థెరిస్సా పురస్కారానికి ఎంపిక



క్రోసూరు: మదర్ థెరీసా జాతీయ స్థాయి సాంఘిక సేవ పురస్కారానికి క్రోసూరు పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శాంసన్ ఎంపికైనట్లు హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేవీ బాబు శనివారం తెలిపారు. దశాబ్దాలుగా వివిధ రంగాల్లో సేవలందించిన వారికి హెల్ప్ ఫౌండేషన్ సంస్థ గుర్తించి ఈ పురస్కారం అందిస్తున్నట్లు చెప్పారు. శిఖా శాంసన్ సేవా కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని పురస్కారానికి ఎంపిక చేసినట్లు చెప్పారు. ఆదివారం సత్తనపల్లి ఐఏఎం హాల్‌లో పురస్కారం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

రీ సర్వే సమస్యలపై గ్రామసభ



పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం గ్రామ సభలు ద్వారా పరిష్కరిస్తుందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు చెప్పారు. మండలంలోని పలు దేవర్లపాడు గ్రామంలో భూ రీసర్వే సమస్యల పై శనివారం గ్రామసభ నిర్వహించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వచ్చిన అర్జీలన్నీ తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. గ్రామ సభలో మండల సర్వేయర్ సుధాకర్, వీఆర్వో సుభాషిణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్య పెరగాలి

డీఎం అండ్ హెచ్ఓ రవి



పెదకూరపాడు: ప్రభుత్వ వైద్యశాలల్లో సాధారణ ప్రసవాలు పెరిగేలా చూడడంతో పాటు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి అన్నారు. శనివారం పెద్దకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రసూతి వార్డులో పర్యటించి గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, వార్డులను పరిశీలించారు. రూ.8.5 కోట్లతో నిర్మించిన నూతన వైద్యశాలలోకి వైద్య సేవలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట వైద్యులు రమేష్, సిబ్బంది ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభ



సత్తెనపల్లి: భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి కోరారు. మండలంలోని భీమవరం గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ గ్రామ సభల ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు. భూములకు సంబంధించి ఏమైనా సమస్యలు తలెత్తితే సభలో తగు ఆధారాలతో అర్జీలు అందజేసి పరిష్కరించుకోవాలని కోరారు. రైతుల నుంచి వచ్చిన 27 దరఖాస్తులను స్వీకరించారు. డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే విజయ్ కుమార్, మండల సర్వేయర్ వై. శ్రీనివాసరావు, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ బోస్‌బాబు, వీఆర్వో లలితా శివజ్యోతి, సర్వేయర్ కోటి లింగాచారి పాల్గొన్నారు.

కార్మికుల పొట్ట కొట్టడం అన్యాయం

నరసరావుపేట: రాజకీయ కారణాలతో తొలగించిన కార్మికులంతా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేదవారని, వారందరినీ మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగ పట్టణ కార్యదర్శి షేక్ చిన అల్లాబక్షు కోరారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆరోపణలు లేకుండా కార్మికులను రాజకీయ కారణాలతో తొలగించడం అన్యాయమని ఖండించారు.

వర్షాలతో తస్మాత్ జాగ్రత్త

- మూగజీవాలకు పొంచి ఉన్న ముప్పు
- ముందస్తు జాగ్రత్తలతో పాడి సంరక్షణ
- వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచిస్తున్న వైద్యులు



జీవాలకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

పశు సంపద వివరాలు

ఆవులు	1,100
గేదెలు	10,500
గొర్రెలు	8,500
మేకలు	500

ముప్పాళ్ళ: ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో పశువులు, జీవాలు వ్యాధులు బారిన పడే ప్రమాదం ఉంది. ఈదురు గాలులు, వర్షపు జల్లులకు దోమల ఉధృతి అధికంగా ఉంది. గొంతువాపు, జబ్బువాపు, గాలికుంటు తదితర వ్యాధులు సోకే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలి. మూగ జీవాలను వ్యాధుల బారి నుంచి కాపాడుకోవాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా పాడి సంపదను కోల్పోక తప్పదని పశుసంవర్ధక వైద్యులు చెబుతున్నారు. సకాలంలో వ్యాధి లక్షణాలు గుర్తించి, చికిత్స అందించాలని చెబుతున్నారు.

గొంతువాపు వ్యాధి

వర్షాకాలంలో పశువులకు సోకే వ్యాధుల్లో గొంతువాపు ప్రధానమైంది. దీన్ని గురక వ్యాధి అని కూడా అంటారు. శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. గొంతు, మెడ వాచిపోవడంతో శ్వాస తీసుకోవడానికి పశువులు ఇబ్బంది పడతాయి.

నివారణ: ముందు జాగ్రత్తగా టీకాలు వేయించుకోవాలి. వ్యాధి ఆశించిన తర్వాత సల్ఫాడిపోజిన్ ఇంజక్షన్ వేయాలి.

పీపీఆర్ వ్యాధి

వైరస్ వల్ల గొర్రెలు, మేకల్లో ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి సోకిన పశువులు 90 శాతం వరకు మృత్యువాత పడతాయి. 106 డిగ్రీల జ్వరం వస్తుంది. ముక్కు నుంచి నీరు కారడం, నోటిలో పుండ్లు ఏర్పడడం గమనించవచ్చు. దుర్గంధంతో కూడిన విరేచనాలవుతాయి. పశువులైతే ఆహారం తీసుకోక మృతి చెందుతాయి. నివారణకు పీపీఆర్ టీకా మందును ముందస్తుగా వేయించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వర్షాల నేపథ్యంలో పశువుల, గొర్రెలు, మేకలను పాకల్లోనే ఉంచాలి.
- బురద, చిత్తడి నేలల్లో తిరగకుండా చూడాలి
- పరిశుభ్రమైన నీరు తాగించాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి.
- మేత, దాణా తగు మోతాదులో ఇవ్వాలి.
- లేగ దూడలను వ్యాధి ప్రబలిన పశువులను దూరంగా ఉంచాలి.
- వ్యాధి లక్షణాలుంటే వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించి, నివారణకు తగు చర్యలు తీసుకోవాలి.
- ముందు జాగ్రత్తగా పశువులకు యాంటిబయాటిక్స్ టీకాలు వేయించాలి.

చిటుక వ్యాధి

దీన్ని ఏంటిరోటాక్సీమియా అని కూడా అంటారు. ఇది క్లాస్ట్రీడియం అనే సూక్ష్మ క్రిమి వల్ల కలుగుతుంది. పచ్చికను గొర్రెలు, మేకలు మేసినప్పుడు గడ్డితో పాటు ఈ వ్యాధిని కలుగ చేసే సూక్ష్మక్రిములు వాటి కడుపులోకి ప్రవేశించి కొన్ని విష పదార్థాలను విసర్జించడం వల్ల ఈ వ్యాధి ఆశిస్తుంది. వ్యాధి సోకిన గొర్రెలు చెంగున ఎగిరి హఠాత్తుగా మరణిస్తాయి. వ్యాధి తీవ్రత తక్కువగా ఉన్నప్పుడు గొర్రెలు పలుచగా పారుకోవడం, కాళ్లు బిగిసి నడవడం, ఒక్కసారిగా పడిపోవడం, తల వెనుకకు లాగుతూ కనిపిస్తాయి. ఆ తర్వాత ఊపిరాడక మరణిస్తాయి.

నివారణ: నాలుగు నెలలు పైబడిన గొర్రె పిల్లలకు ప్రతి ఏడాది సీజన్‌లో చిటుక రోగం నిరోధక టీకాలు వేయించాలి. ఈ టీకాలు వేసే సమయానికి నెల రోజులు ముందుగా విధిగా గొర్రెలన్నింటికీ నట్టల, బద్దె పురుగు నివారణ మందు తాగించాలి. టీకాలు వేసిన గొర్రెలకు ఒక సంవత్సరం వరకు ఈ వ్యాధి రాదు. ఈ టీకా ప్రతి పశువైద్యశాలలో ఉచితంగా లభిస్తుంది.

టీకాలు వేస్తున్నాం



చర్మ వ్యాధులతో పాటుగా మిగతా వ్యాధులకు టీకాలు వేస్తున్నాం. ముఖ్యంగా పశువులను వర్షంలో తడవనీయకూడదు. వర్షం తగ్గే వరకు పశువులను పాకల్లోనే ఉంచాలి. మేతకు తీసుకెళ్లేటప్పుడు తుప్పలు, డొంకలు విషసర్పాలుండే ప్రమాదముంది. కాబట్టి పెంపకం దారులు అప్రమత్తంగా ఉండాలి. పశు ఆసుపత్రుల వద్ద, గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నాం.

–ఎం.పుల్లారెడ్డి, ఇన్‌చార్జ్ మండల పశువైద్యాధికారి, ముప్పాళ్ళ

ఘనంగా అట్ల తద్ది



వాయినాలు ఇచ్చుకుంటున్న ముత్తయిదులు

పెదకూరపాడు: మండలంలో అట్ల తద్ది వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. వివాహమైన వారికి పుట్టింట్లో తెల్లవారు జామునే పవిత్ర స్నానాలు చేసి.. మేనమామ పోతురాజుగా, ఐదుగురు పుణ్య స్త్రీలు ముత్తైదువులుగా ఉండి తలా ఒక ముద్ద ఇచ్చి, సూర్యోదయానికి ముందే తిని, పగలు ఉపవాసం ఉన్నారు. వ్రతంలో ఉన్నవారు పగలు ఊయల ఊగారు. చంద్రోదయం అయ్యాక ఉపవాసం ముగించారు. ముద్దపప్పు మూడట్లు, అట్లతద్ది ఆరట్లు, ఇచ్చుకుంటి నమ్మ వాయనం, పుచ్చుకుంటి నమ్మ వాయనం అంటూ ముత్తైదువులకు అట్లు, అరిసెలు వాయనమిచ్చారు. అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. గ్రామాల్లో రావి, తాడి చెట్లుకు పెద్ద ఎత్తున ఊయలలు వేశారు. 75త్యాల్లూరులో గ్రామీణ ప్రాంత సాంప్రదాయాలను గౌరవించి కొనసాగించడం హర్షణీయం.

గంగ అరెస్ట్ హేయం

సత్తెనపల్లి: ములవాసి బచావో మంచ్ కార్యకర్త గంగను చత్తీష్‌ఘర్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడులో పోలీసులు శుక్రవారం రాత్రి 8 గంటలకు అక్రమంగా అదుపులోకి తీసుకోవడం హేయమైన చర్య అని ఏపీ పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీనియర్ న్యాయవాది చిలుకా చంద్రశేఖర్ అన్నారు. గంగను అదుపులోకి తీసుకోవడాన్ని శనివారం ఆయన ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసులు ఇప్పటి వరకు ఏ కేసులో అరెస్టు చేసింది? ఆ వివరాలు బంధు మిత్రులకు తెలియజేస్తూ నోటీసులు ఇవ్వకపోవడంతో వారు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. గంగపై కేసులుంటే వెంటనే కోర్టులో హాజరు పరచాలన్నారు. లేకుంటే భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు ఏపీ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేదంగి చిట్టిబాబు ఉన్నారు.

గుంత.. ప్రమాదాల చింత





సత్తెనపల్లి రోడ్డు సెంటర్‌లో గుంతలు

అమరావతి: ప్రసిద్ధ పర్యాటక కేంద్రం అమరావతి ముఖ ద్వారం అంబేడ్కర్ బొమ్మ సెంటర్‌లో మోకాలి లోతు గుంతలతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. సత్తెనపల్లి, గుంటూరు నుంచి వచ్చే వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు మోకాలి లోతు గుంతలు ప్రమాదకరంగా మారాయి. మట్టితో వాటిని పూడ్చడంతో కుంగిపోయి భారీ వా హనాలు టైర్లు ఇరుక్కుపోయి ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. రాత్రిళ్ల ప్రమాద తీవ్రత అధికంగా ఉంది. కనీసం అమరావతి నడి బొడ్డున సెంటర్‌లో ఉన్న ఈ గుంతలకు మరమ్మలు చేసి, ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

కొండయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

వినుకొండ(నూజెండ్ల): దొండపాడులో పిడుగుపాటుకు మరణించిన పి. కొండయ్య కుటుంబానికి కూటమి ప్రభుత్వం రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము కోరారు. ఆ కుటుంబాన్ని శనివారం రైతు సంఘం నాయకులు పరామర్శించారు. కుటుంబం దీనస్థితిలోకి వెళ్లకుండా ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రాము డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కె.మల్లికార్జునరావు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సాఫ్ట్ బాల్ రాష్ట్ర జట్టుకు విద్యార్థుల ఎంపిక



నాదెండ్ల: సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అండర్- 14 సాఫ్ట్‌బాల్ రాష్ట్రజట్టుకు ఎంపికయ్యారు. రొంపిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన పోటీల్లో సిద్ధాబత్తిని మోహనలక్ష్మి (8వ తరగతి), వనపర్తి జశ్వంత్ తేజ (7వ తరగతి) ఎంపికయ్యారు. ఇద్దరూ ఈ నెలాఖరులో చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులను హెచ్‌ఎం వెంకటరావు, పీడీ కె. అంజమ్మ, ఇన్‌చార్జి హెచ్‌ఎం పి. ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

చట్టాలను పారదర్శకంగా అమలు చేయాలి

రొంపిచర్ల : రాష్ట్ర ప్రభుత్వం చట్టాలను పారదర్శకంగా అమలుచేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. శనివారం రొంపిచర్ల వచ్చిన ఆయనకు బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ఉన్న అట్రాసిటీ చట్టం లాగా బీసీలకు రక్షణ చట్టం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీలలో ఎక్కువగా చేతి వృత్తులకు సంబంధించిన కులాలు ఉన్నాయని, వీరందరికీ రక్షణ చట్టం ఎంతో అవసరమని తెలిపారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. అనంతరం శంకరరావును బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు, మండల నాయకులు ముక్కడాల శ్రీనివాసరావు, వెంగళరాజు సుబ్బరాజు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

దాచేపల్లి: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. నడికుడి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు అద్దంకి-నార్కెట్‌పల్లి హైవేపై ఢీకొన్నాయి. ఈ ఘటనలో రామాపురంకి చెందిన పిల్లి నవీన్, అద్దంకి చెందిన పసుపులేటి అభినవ్ గాయపడ్డారు. క్షతగాత్రులను గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో పాలట్యాంకర్ ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తులను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పాఠశాల ఆవరణలో మట్టి తోలించాలి

ఈపూరు : స్థానిక బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణ రోడ్డు కంటే పల్లంగా ఉన్నందున నీరు నిలబడి విద్యార్థులకు ఇబ్బందికరంగా మారిందని, తక్షణమే మెరక తోలించాలని ఎంపీడీవో ప్రభాకర్‌కు పాఠశాల యాజమాన్య కమిటీ శనివారం వినతిపత్రం అందజేసింది. పాఠశాల ఆవరణలో ప్రార్థన నిర్వహించడానికి కూడా ఇబ్బందిగా ఉందని వివరించారు. నిధుల కొరతతో మనబడి-మన భవిష్యత్ పనులు మధ్యలో నిలిచిపోయాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తెలుగుతల్లి విగ్రహం ఏర్పాట్లు పరిశీలన

నరసరావుపేట: స్టేషన్ రోడ్డులోని గాంధీ పార్కులో తెలుగుతల్లి విగ్రహ ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆరేళ్ల క్రితం ఆర్‌యూబీ పక్కనే ఉన్న స్థలంలో ఏర్పాటు చేసిన తెలుగుతల్లి విగ్రహాన్ని తొలగించి గాంధీపార్కులో ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. అనంతరం 12వ వార్డు షాలెంనగర్, మున్సిపల్ కార్యాలయం సమీపంలో పారిశుద్ధ్య, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను ఆయన పరిశీలించారు.

పీడీగా రాధాకృష్ణమూర్తి సేవలు అభినందనీయం



శావల్యాపురం: అంకితభావంతో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు సమాజంలో మంచి గుర్తింపు పొందుతారని బెజవాడ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో శనివారం పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో బాలబాలికలు ఉత్తమ ఫలితాలు సాధించడానికి రాధాకృష్ణమూర్తి కృషి చేశారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడిగా రాధాకృష్ణమూర్తి సేవలు అభినందనీయమని కొనియాడారు. అనంతరం ఆయన్ను దుశ్శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాసరాజు, భువనేశ్వరి, నిర్మల పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏఓ అరుణ

ముప్పాళ్ళ: ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా రైతులు ఫిర్యాదు చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ హెచ్చరించారు. మండలంలోని ముప్పాళ్ళ, దమ్మాలపాడు గ్రామాల్లోని ఎరువుల గోదాముల్లోని నిల్వలను శనివారం ఆమె పరిశీలించారు. మండలంలో సాగుకు సరిపడా ఎరువులు ఉన్నాయని, ప్రస్తుతం యూరియా 91 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 210 టన్నులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. వచ్చే వారంలో మొక్కజొన్న సాగు ఆరంభమవుతుందని, అందుకు అవసరమైన నిల్వలను సిద్ధం చేస్తున్నామన్నారు. సొసైటీల్లోను నిల్వ ఉంచేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నకరికల్లు: గ్రామాల్లోని అంతర్గత రోడ్లు పూర్తి చేసి గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని అడ్డరోడ్డు, నకరికల్లు గ్రామాల్లో శనివారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. అడ్డరోడ్డు గ్రామంలో రూ.10 లక్షలతో, నకరికల్లులో రూ.20లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో కల్పించాల్సిన మౌలిక వసతులపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జెడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, మాజీ ఎంపీపీ నాగోతు శౌరయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో పురుగుల నివారణ

డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ శివకుమారి



శిక్షణ కార్యక్రమంలో డీడీఏ శివకుమారి

అచ్చంపేట: పత్తి పంటలో సమగ్ర పంట యాజమాన్య పద్ధతుల ద్వారా గులాబి రంగు, కాయ తొలచు, రసం పీల్చే పురుగులను నివారించవచ్చని డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎం.శివకుమారి తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో క్రోసూరు సబ్ డివిజన్ పరిధిలోని క్రోసూరు, అచ్చంపేట, అమరావతి, బెల్లంకొండ, రాజుపాలెం మండలాలకు చెందిన గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, బహుళ ప్రయోజన విస్తరణాధికారులకు శనివారం ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం.శివకుమారి ముఖ్య అతిథిగా హాజరై పంట యాజమాన్య పద్ధతులను వివరించారు. కంది, వరి పంటలలో యాజమాన్య పద్ధతులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు వి.హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి గ్రామ స్థాయి అధికారి పంట వివిధ దశలు, పంటలను ఆశించే తెగుళ్ల, చీడపీడల ఫొటోలను సీఎల్ఎస్-పీడీఎస్ఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ నెల 22 నుంచి సబ్ డివిజన్‌లోని ప్రతి గ్రామంలో ఎలుకల నివారణకు బ్రోమోడియలిన్ మందు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఏవో వెంకటేశ్వర్లు, ప్రవీణ్, అమరావతి ఏవో అహమ్మద్, క్రోసూరు ఏవో వి.వేణుగోపాల్, బెల్లంకొండ ఏవో డి.కృష్ణయ్య, రాజుపాలెం ఏవో పీవీ నరసయ్య పాల్గొన్నారు.

స్నేహ హస్తాలు సేవలు అభినందనీయం



కుట్టు మిషన్, కుర్చీలు అందజేస్తున్న సంస్థ సభ్యుడు

బెల్లంకొండ: స్నేహ హస్తాలు ఫౌండేషన్ ద్వారా సంస్థ సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపల్ టి.ఉషారాణి పేర్కొన్నారు. శనివారం పాఠశాలకు స్నేహ హస్తాలు సంస్థ ద్వారా కుట్టు మిషన్, చైర్స్‌ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ గతంలో ఈ ఫౌండేషన్ ద్వారా పాఠశాలలో ఆట స్థలాన్ని బాగు చేయించడమే కాకుండా, ఎన్నో ఉపకరణాలను అందజేసి, పాఠశాల సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేహ హస్తాలు ఫౌండేషన్ కో ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• ఈ బురదలోనే వెళ్లాలి



బురదమయంగా మారిన రహదారి



నిలిచిన వర్షపు నీరు

సత్తెనపల్లి: పట్టణంలోని 10వ వార్డు వాసవి నగర్‌లోని బీసీ బాలికల వసతి గృహ రోడ్డు అధ్వానంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా ఈ రోడ్డు బురద మయంగా మారి, జారుడు బల్లలా తయారవుతోంది. రోడ్డు వెంబడి పిచ్చి కంప అధికంగా ఉండడంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా మందు బాబులు మద్యం సేవించేందుకు అక్కడికి చేరుకుంటున్నారు. ఈ రహదారిలో వేద నర్సింగ్ విద్యార్థినులు, ఇతరులు 150 మంది వసతి గృహానికి, 20కి పైగా గృహాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అధ్వానంగా ఉన్న రోడ్డును పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా గ్రావెల్ తోలి, మరమ్మతులు చేపట్టాలని విద్యార్థినులు, ప్రజలు కోరుతున్నారు.

గోకులానికి శంకుస్థాపన

రాజుపాలెం: మండలంలోని దేవరంపాడు, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా అధికారులు, నాయకులు పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపనలు చేశారు. దేవరంపాడులో సీసీ రోడ్డు, బ్రాహ్మణపల్లిలో గోకులానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఈవోపీఆర్డీ పగడాల ముక్కంటి, టీడీపీ మండల కన్వీనర్ పల్లపాటి పెద్దిరాజు, జనసేన మండల కన్వీనర్ తోట నర్సయ్య, నాయకులు నరసింహారావు, ప్రభుదాసు, శ్రీను తదితరులు ఉన్నారు.